సాక్షి
కుమురం భీం

గురువారం : 22 : మే : 2025



పుష్కర ఘాట్లపై మట్టికుప్పలు

బాసర గోదావరినది పుష్కరఘాట్ల వద్ద పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. నీటి ప్రవాహం తగ్గడంతో నల్లమట్టి కుప్పలుగా పేరుకుపోయింది. 8లో▸



సాగునీరు పారేదెలా..?

20 సంవత్సరాల క్రితం పీపీరావు ప్రాజెక్టు నిర్మించారు. కుంచవెల్లి, కల్వాడ, చంద్రపల్లి, లగ్గాం, గెర్రె, గిరవెల్లి, గ్రామాల వైపు కాలువలు అధ్వానంగా మారాయి. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.5 /26.8

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుతాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

టీకాలతో వ్యాధులు దూరం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సీతారాం

ఆసిఫాబాద్‌రూరల్: సకాలంలో టీకాలు వేసుకోవడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండొచ్చని డీఎంహెచ్‌వో సీతారాం అన్నారు. ఆసిఫాబాద్ మండలం అడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అంకుసాపూర్ గ్రామంలో బుధవారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈ నెల 28లోగా వ్యాధి నిరోధక టీకాలు వేయాలన్నారు. అవసరం ఉన్న ప్రతిఒక్కరికి టీకాలు వేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి సంపత్, పారా మెడికల్ అధికారి శ్యాంలాల్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

3 నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో జూన్ 3 నుంచి 13 వరకు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈవో యాదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

14న జాతీయ లోక్‌అదాలత్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో జూన్ 14న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా అన్నిరకాల సివిల్, క్రిమినల్ కేసులు, ఎక్సైజ్, ఫ్యామిలీ, ఇతర కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


కనీస సామర్థ్యాల సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న దీపక్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థుల్లో కనీస సామర్థ్యాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని శిక్షణ రాష్ట్ర పరిశీలకుడు దీపక్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను మరింత బలోపేతం చేసేందుకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. డీఆర్‌పీలు సత్యనారాయణగౌడ్, నారాయణగౌడ్, హెచ్‌ఎం ఉదయ్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ ఆదర్శప్రాయుడు



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: విలువలకు కట్టుబడి పనిచేసిన దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ నేటి రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయుడని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం రాజీవ్‌గాంధీ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. మరోవైపు ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్ ఆధ్వర్యంలోనూ రాజీవ్‌గాంధీ వర్ధంతి నిర్వహించారు. పట్టణంలో వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది.

విచారణ చేపట్టాలి

ఆసిఫాబాద్‌రూరల్: వ్యవసాయ అధికారి నకిలీ ఎస్సీ సర్టిఫికెట్ వ్యవహారంపై విచారణ చేపట్టాలని కోరుతూ డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే వినతిపత్రం అందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు కార్తీక్, దినకర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందిన డీఏవో తాను ఎస్సీ అని నమ్మించి ప్రభుత్వ యంత్రాంగాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఖద్దరు జులుం!?

'చాలా మంది అధికారులు తాము చెప్పినట్లు వినడం లేదు. మా మాట వినని ఒక అధికారిని బదిలీ చేయించాం. మరికొందరికి హెచ్చరిస్తున్నా.. మేము చెప్పినట్లు వినకపోతే వారిని కూడా జూన్‌లోగా జిల్లా నుంచి తరిమేస్తాం...' ఇటీవల ఆసిఫాబాద్‌లో అధికార పార్టీ సమావేశంలో పోలీసులపై పరోక్షంగా ఆగ్రహం వ్యక్తం చేసిన పార్టీ నేత మాటలివి..

'ఇక్కడ పనిచేయాలంటే తాము చెప్పినట్లు వినాలి. తమకు అనుకూలంగా పనిచేయాలి. జూదం, ఇసుక, పశువుల అక్రమ రవాణా వంటి కార్యకలాపాలపై చూసీచూడనట్లు వ్యవహరించాలి. లేకపోతే బదిలీ చేయిస్తాం...' ఇటీవల కాగజ్‌నగర్‌లో అధికార పార్టీ ప్రజాప్రతినిధి ఇంట పోలీసు అధికారికి ఓ లిక్కర్ డాన్ చేసిన హెచ్చరిక ఇది.



- పోలీసులు చెప్పినట్లు వినాలంటూ హుకుం
- ఇటీవల అధికారపార్టీ ప్రజాప్రతినిధి ఇంట్లో ఓ సీఐకి వింత అనుభవం
- ప్రజాప్రతినిధి ఎదుటే రెచ్చిపోయిన లిక్కర్ డాన్
- పోలీస్ బాస్ పనితీరుపై తీవ్ర ఆరోపణలు చేసిన వైనం..

సాక్షి, ఆసిఫాబాద్: స్వయాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీసుశాఖ ప్రతిష్టాత్మకంగా పనిచేస్తేనే కాంగ్రెస్ సర్కారుకు మంచిపేరు వస్తుందని చెబుతుంటే.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇక్కడ పనిచేయాలంటే పోలీసు అధికారులకు ముందుగా ఖద్దరు ఆశీస్సులు తప్పనిసరి అన్నట్లుగా పరిస్థితి తయారైంది. నిక్కచ్చిగా పనిచేసే అధికారిగా పేరుండి.. ఎలాంటి రాజకీయ సిఫార్సు లేకుండా బదిలీపై వచ్చే అధికారులను స్థానిక అధికార పార్టీ నేతలు బెదరకొడుతున్నారు. ఇటీవలే కాగజ్‌నగర్ డివిజన్‌కు బదిలీపై వచ్చిన ఓ పోలీసు అధికారి కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధిని మర్యాదపూర్వకంగా కలిసేందుకు వెళితే ఆయనకు ఓ వింత అనుభవం ఎదురుకావడం గమనార్హం. ప్రజాప్రతినిధి ఇంట్లో ఉన్న ఓ లిక్కర్ డాన్ సదరు పోలీసు అధికారికి తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేయడం దురదృష్టకరం.

చెప్పినట్లు వినాల్సిందే..

ప్రజాప్రతినిధిని కలిసిన పోలీసు అధికారితో లిక్కర్ డాన్ మాట్లాడుతూ.. ఇక్కడ పనిచేయాలంటే మేం చెప్పినట్లు వినాల్సిందేనంటూ ఓ దశలో తీవ్ర స్వరంతో హెచ్చరించినట్లు సమాచారం. 'తమ వ్యాపారాల వైపు కన్నెత్తి చూడరాదంటూ.. తన అనుచరుల విషయంలోనూ చూసీచూడనట్లు ఉండాలంటూ' లిక్కర్ డాన్ ఆదేశించడంతో ఆశ్చర్యపోవడం పోలీసు అధికారి వంతైందని అక్కడే ఉన్న కొందరు కాంగ్రెస్ పార్టీ నేతలు పేర్కొనడం విడ్డూరం. మీ పోలీసు బాస్ కూడా తనకు అనుకూలంగా పనిచేసే అధికారులను ముడుపులు తీసుకొని బదిలీ చేయిస్తున్నారని.. ఆయన పని పడతామంటూ ఆరోపణలు చేసినట్లు తెలుస్తోంది. ఇదంతా అధికారపార్టీ ప్రజాప్రతినిధి ఎదుటే జరుగుతున్నా.. ఆయన లిక్కర్ డాన్‌కు అడ్డుకునే ప్రయత్నం చేయలేదని సమాచారం. దీంతో లిక్కర్ డాన్ అధికారిపై మరింత రెచ్చిపోయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ అంశం పోలీసుల్లో చర్చనీయాంశంగా మారింది.

రెచ్చిపోతున్న లిక్కర్ డాన్..

కాగజ్‌నగర్ డివిజన్‌లో ఆయనో లిక్కర్ డాన్. పలు వ్యాపారాలు నిర్వహిస్తుంటాడు. జూదం ఆడటం ఆయనకు సరదా. అవసరమైతే తన ఇంట్లోనే పేకాట ఆడేవారికి ఆతిథ్యం ఇచ్చేంత పెద్ద మనసు ఆయనది. మొన్నటి వరకు బీఆర్‌ఎస్ పార్టీ నేతలతో అంటకాగి... వారి అండతో అక్రమ వ్యాపారాలను మూడు బాటిళ్లు.. ఆరు బీర్లుగా సాగించాడు. రూ.కోట్లు జేబులు నింపుకున్న అతను ఇటీవల అధికారపార్టీ కండువా కప్పుకున్నాడు. ప్రజాప్రతినిధి పక్కన చేరిపోయాడు. తాజాగా అధికార పార్టీ ప్రజాప్రతినిధికి కుడి భుజంలా మారినట్లు తెలుస్తోంది. ఇటీవల ఇతర జిల్లా నుంచి ఓ పోలీసు అధికారి కాగజ్‌నగర్ డివిజన్‌కు బదిలీపై వచ్చారు. ఆయన బాధ్యతలు తీసుకున్న తర్వాత మర్యాదపూర్వకంగా అధికార పార్టీ ప్రజాప్రతినిధిని కలిసేందుకు ఆయన ఇంటికెళ్లారు. అంతకు ముందు అక్కడ పనిచేసిన పోలీసు అధికారితో వ్యాపారాల్లో నష్టం చవిచూసిన లిక్కర్ డాన్.. కొత్తగా వచ్చిన పోలీసు అధికారిని చూసిన వెంటనే రెచ్చిపోయినట్లు సమాచారం.

'సప్లిమెంటరీ'కి సర్వం సిద్ధం

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- జిల్లాలో ఏడు కేంద్రాలు ఏర్పాటు

ఆసిఫాబాద్‌రూరల్: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. 2,292 మంది విద్యార్థులు హాజరు కానుండగా, జిల్లాలో ఏడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఫస్టియర్‌లో 1,487 మంది పరీక్షలు రాయనుండగా, ఇందులో జనరల్ విద్యార్థులు 1,348 మంది, ఒకేషనల్ 139 మంది ఉన్నారు. ద్వితీయ సంవత్సరంలో 805 మంది పరీక్షలు రాయనుండగా, ఇందులో జనరల్ విద్యార్థులు 709 మంది, ఒకేషనల్‌లో 96 మంది ఉన్నారు.

కేంద్రాలు ఇవే..

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల కోసం జిల్లాలో ఏడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ మోడల్ స్కూల్, కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, వసుంధర జూనియర్ కళాశాలతోపాటు జైనూర్, కెరమెరి, కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 22న ప్రారంభమయ్యే పరీక్షలు ఈ నెల 28 వరకు కొనసాగనున్నాయి. ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఏడు కేంద్రాల్లో 75 మంది ఇన్విజిలేటర్లు, ఏడుగురు సీఎస్‌లు, ఏడుగురు డీవోలు, రెండు సిట్టింగ్ స్క్వాడ్స్, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియమించారు. అలాగే కలెక్టర్, అదనపు కలెక్టర్ కూడా పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించనున్నారు.



జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

నిర్భయంగా పరీక్షలు రాయాలి



సప్లిమెంటరీ పరీక్షలకు 2,295 మంది హాజరు కానున్నారు. నిర్వహణ కోసం అన్నిఏర్పాట్లు పూర్తి చేశాం. మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా అన్ని సెంటర్లలో సీసీ కెమెరాలు ఉన్నాయి. విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయాలి.

– కళ్యాణి, డీఐఈవో

పెండింగ్ సమస్యలకు సత్వర పరిష్కారం

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో నెలకొన్న పెండింగ్ సమస్యలకు సత్వరమే పరిష్కార మార్గం చూపిస్తామని జనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో బుధవారం ఏఐటీయూసీ నాయకులతో స్ట్రక్చర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి జీఎం కమిటీ సభ్యులతో కలిసి సమావేశానికి హాజరయ్యారు. పలు సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారంపై చర్చించారు. గోలేటి టౌన్‌షిప్‌కు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని, గోలేటి నుంచి ఎక్స్‌రోడ్ వరకు లైటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. గోలేటి సీహెచ్‌పీ, ఏరియా వర్క్‌షాప్‌లో మ్యాన్ పవర్ కొరతను పరిష్కరించేందుకు జనరల్ అసిస్టెంట్లకు పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. గోలేటి డిస్పెన్సరీలో కూల్ వాటర్ సౌకర్యం కల్పించాలని, మాదారం టౌన్‌షిప్‌కు రెండో షిఫ్టులో ఎలక్ట్రీషియన్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామని జీఎం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఖైరిగూడ ప్రాజెక్టు అధికారి నరేందర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహెరా, డీవైజీఎం సివిల్ ఎస్కే మదీనా బాషా, అకౌంట్స్ అధికారి రవికుమార్, సీహెచ్‌పీ ఎస్ఈ కోటయ్య, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, జీఎం కమిటీ సభ్యులు శేషశయనరావు, రాజేష్, మారిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కార్మిక సమస్యలపై చర్చిస్తున్న అధికారులు, ఏఐటీయూసీ నాయకులు

అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో అలసత్వం ప్రదర్శించొద్దని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి బుధవారం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి పనులు వర్షాకాలం ప్రారంభంలోగా పూర్తి చేయడంపై దృష్టి సారించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద చేపట్టిన పనులు జూన్ 11లోగా పూర్తి కావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో విద్యార్థుల సౌకర్యం కోసం తాగునీరు, మరుగుదొడ్లు, పెయింటింగ్, చేతిపంపులకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్, హౌసింగ్ డీఈ వేణుగోపాల్, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

బ్యాంకర్లు రుణలక్ష్యాలు సాధించాలి

ఆసిఫాబాద్‌రూరల్: బ్యాంకర్లు తమకు నిర్దేశించిన వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలు పూర్తిస్థాయిలో సాధించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో డీఆర్‌డీవో దత్తారావు, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ రాజేశ్వర్‌జోషితో కలిసి బుధవారం వివిధ బ్యాంకుల మేనేజర్లతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ వెనుకబడిన జిల్లాలో ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారి సిబిల్ స్కోర్ పరిశీలించి నివేదిక అందించాలన్నారు. 2025– 26 ఆర్థిక సంవత్సరానికి రూ.3,233 కోట్ల రుణ లక్ష్యం నిర్దేశించినట్లు తెలిపారు.

బాల్య వివాహాల నిర్మూలనకు చర్యలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని జువైనల్ జస్టిస్ బోర్డు చైర్‌పర్సన్ అనంతలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలో నాల్సా చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ ఫర్ చిల్డ్రన్ స్కీం– 2024పై బుధవారం జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ యువరాజతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలో బాల్య వివాహాలు అరికట్టేందుకు బాల్య వివాహ నిషేధ చట్టం– 2006 సెక్షన్ 13 ప్రకారం ఇక నుంచి జూనియర్ సివిల్ జడ్జి ఇంజక్షన్ ఆర్డర్లు జారీ చేయాలని ఆదేశించారు. బాలల హక్కులకు భంగం కలిగించే వారిపై చర్యలకు ఉపేక్షించొద్దన్నారు. హక్కుల రక్షణకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. సమావేశంలో డీసీపీవో మహేశ్, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనంతలక్ష్మి

గోవులను కబేళాలకు తరలిస్తే చర్యలు

- డీఎస్పీ రామానుజం

కాగజ్‌నగర్‌టౌన్: గోవులను కబేళాలకు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం అన్నారు. పట్టణంలోని టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కబేళాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ పశువైద్యాధికారి ఫిట్‌ఫర్ స్లాటర్ సర్టిఫైడ్ చేసిన పశువులను మాత్రమే కబేళాలకు తరలించాలని సూచించారు. వేస్టేజ్‌ను ఎక్కడపడితే అక్కడ వేయొద్దని, పాలిథిన్ సంచుల్లో నిల్వ చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. బక్రీద్ సందర్భంగా సోషల్ మీడియాలో అసత్యపు ప్రచారం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పశువైద్యాధికారి పరిమళ, సీఐ ప్రేమ్‌కుమార్, ఎస్సై సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రామానుజం

నకిలీ పత్తి విత్తనాలపై నిఘా

నకిలీ పత్తి విత్తనాలు, ఎరువులపై నిఘా ఉంచామని, రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రామానుజం హెచ్చరించారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫెర్టిలైజర్ దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించిన వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామన్నారు. కాగజ్‌నగర్ సీఐ ప్రేంకుమార్, ఎస్సైలు పాల్గొన్నారు.

కుప్పల వద్ద రైతుల తిప్పలు

- అకాల వర్షానికి తడిసిన ధాన్యం



దహెగాం మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం బస్తాలు చూపుతున్న ఈ రైతు పేరు చపిలె దేవాజీ. మంగళవారం సుమారు 150 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు కాంటా పెట్టారు. కాంటా పూర్తయినా మిల్లుకు తరలించకపోవడంతో బుధవారం అకాల వర్షానికి బస్తాలన్నీ తడిచిపోయాయి. ఉన్నతాధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో పరిస్థితి అగమాగమైందని ఆవేదన వ్యక్తం చేశాడు.

దహెగాం/పెంచికల్‌పేట్/కౌటాల: యాసంగిలో ఎన్నో ఆశలతో సాగు చేసిన వరి ధాన్యం వర్షార్పణం అవుతోంది. అకాల వర్షాలు అన్నదాతలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. నెలలపాటు కష్టపడి పండించిన వడ్లు కొనుగోలు కేంద్రాల్లోనే తడిసిపోతోంది. ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతుండటం, రెండు రోజులుగా ఆకాశం మబ్బులు పట్టిఉండటంతో ధాన్యం కాపాడుకునేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. బుధవారం మధ్యాహ్నం తర్వాత దహెగాం మండలంలో అకాల వర్షం బీభత్సం సృష్టించింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటా పూర్తయినా లారీలు రాకపోవడంతో బస్తాలు కదలడం లేదు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు రాత్రిపూట అంధకారంలో గడిపారు. పెంచికల్‌పేట్ మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం కాపాడుకోవడానికి రైతులు టార్పాలిన్లు కప్పారు. గాలి దుమారానికి కవర్లు కొట్టుకుపోయి ధాన్యం తడిసింది. కౌటాల మండలంలో సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. చెట్ల కొమ్మలు విరిగిపోవడంతో గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సాండ్గాం, వీరవెల్లి, కౌటాల, ముత్తంపేట, గుడ్లబోరి గ్రామాల్లో నూర్పిడి చేసి ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. వీరవెల్లిలోని కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం తడవకుండా కవర్లు కప్పడానికి రైతులకు తిప్పలు తప్పలేదు. మూడు రోజులుగా సాయంత్రం మబ్బులను చూసి ధాన్యంపై టార్పాలిన్లు కప్పుకోవడం, ఉదయం మళ్లీ ఎండకు తీయడం ఇబ్బందిగా మారింది. గురుడుపేట సహకార సంఘం ఆధ్వర్యంలో కౌటాల, ఐకేపీ ఆధ్వర్యంలో సాండ్గాం, వీరవెల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇటీవలే ప్రారంభించారు. సరిపడా స్థలం లేకపోవడంతో రైతులు ఇళ్ల వద్దనే ధాన్యం ఆరబెట్టుకుంటున్నారు.



దహెగాం కొనుగోలు కేంద్రంలో వరదనీరు



ధాన్యంపై టార్పాలిన్ కప్పుతున్న రైతు



వీరవెల్లిలో ధాన్యం కుప్పలపై కప్పిన కవర్లు



ఎల్కపల్లిలో కవర్లు కప్పుతున్న రైతులు

'ఉత్తమ' విద్యార్థులకు సన్మానం

ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన గిరిజన విద్యార్థులను బుధవారం హైదరాబాద్‌లో గిరిజన విద్యాశాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. జిల్లా కేంద్రంలో గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విష్ణువర్ధన్, అరవింద్‌ను మంత్రి సీతక్క, ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ శరత్, గురుకుల సెక్రెటరీ సీతాలక్ష్మి సన్మానించి ప్రశంసాపత్రాలు అందించారు. విద్యార్థులు వంద శాతం హాజరుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ భద్రయ్య తెలిపారు.



పదో తరగతి విద్యార్థులతో ప్రిన్సిపాల్

క్లుప్తంగా

ఉపాధ్యాయురాలికి అరుదైన గౌరవం


అరుణ బట్టువార్

ఇంద్రవెల్లి: బాల సాహిత్య వికాసం కోసం విశిష్ట సేవలందిస్తూ విద్యార్థులను సాహితీ వేత్తలుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్న ఇంద్రవెల్లి జిల్లా పరిషత్ పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు అరుణ బట్టువార్‌కు అరుదైన గౌరవం దక్కింది. తన సంపాదకత్వంలో విద్యార్థులచేత ఇప్పటి వరకు ఆరు పుస్తకాలు ముద్రింపజేశారు. ఆమె సేవలను గుర్తించి ఈ నెల 25న హైదరాబాద్‌లో తెలంగాణ సారస్వత పరిషత్ 82వ స్థాపన దినోత్సవం సందర్భంగా నిర్వహించే బాల సాహిత్య సమ్మేళనంలో సత్కరించనున్నారు.

ప్రమాదవశాత్తు పశువుల కొట్టం దగ్ధం

బజార్‌హత్నూర్: ప్రమాదవశాత్తు పశువుల కొట్టం దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని కొంగర్ల పోతన్నకు చెందిన పశువుల కొట్టంలో బుధవారం మంటలు అంటుకున్నాయి. గమనించిన గ్రామస్తులు ఇచ్చోడ ఫైరింజన్‌కు, పోలీసులకు సమాచారం అందించారు. ప్రొహిబిషన్ ఎస్సై రాజశేఖర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో మోటర్ల ద్వారా నీళ్లు పోయించారు. కొద్ది సేపటికి ఫైరింజన్ రావడంతో సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఘటనలో పశుగ్రాసంతో పాటు, వ్యవసాయ పనిముట్లు, పైపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. రూ.4 లక్షల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

యూత్ కాంగ్రెస్ నాయకుల బాహాబాహీ


ఇరు వర్గాలను చెదరగొడుతున్న పోలీసులు

మంచిర్యాలటౌన్: సరస్వతి పుష్కరాలకు పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణను ఆహ్వానించకుండా అవమానించడాన్ని నిరసిస్తూ బుధవారం యూత్ కాంగ్రెస్ నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలు జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో నిరసన చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించేందుకు వెళ్తుండగా ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు వర్గీయులు బూతులు తిడుతూ అడ్డుకున్నారని ఎంపీ వర్గీయులు తెలిపారు. తాము శాంతియుతంగా నిరసన తెలుపుతామని చెప్పినా వినకుండా తమను అడ్డుకోవడం సరికాదని యూత్ కాంగ్రెస్ నాయకులు రాయబారపు కిరణ్, ఆసంపల్లి శ్రీకాంత్ అన్నారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరుగుతుండడంతో పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించి వేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు పున్నం, సృజన్, మాయ తిరుపతి, దాసరి సంపత్, శ్రీశైలం, అరుణ్, రాజేశ్, వెంకటేశ్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

పుష్కర ఘాట్లపై మట్టికుప్పలు

- బాసరలో భక్తులకు తప్పని అవస్థలు


కలుషిత నీటిలో స్నానం చేస్తున్న భక్తులు


పుష్కర ఘాట్లపై నల్లమట్టి కుప్ప

బాసర: తెలంగాణ రాష్ట్రంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సరస్వతీ అమ్మవారు కొలువైన బాసర గోదావరిన ది పుష్కరఘాట్ల వద్ద పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొదటి పుష్కర ఘాట్ నుంచి రెండో పుష్కరఘాట్ వరకు గోదావరి నీటి ప్రవాహం తగ్గడంతో పుష్కరఘాట్లపై నల్లమట్టి పెద్దపెద్ద కుప్పలుగా పే రుకుపోయింది. బాసర సరస్వతీ అమ్మవారి సన్ని ధిలో తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాదు దక్షిణాది రా ష్ట్రాల నుంచి కూడా లక్షలాదిగా భక్తులు తరలివస్తారు. ముందుగా పవిత్ర గోదావరినదిలో పుణ్య స్నానం ఆచరించడం పుణ్యఫలంగా భావిస్తారు. కానీ అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పట్టింపులేనితనంతో గోదావరి ఘాట్ తీరమంతా అస్తవ్యస్తంగా మారింది. బురద, చెత్తాచెదారంతో దుర్గంధం వెదజల్లుతోంది. బాసర ప్రధాన స్నానఘాట్ పైభాగంలో గంగమ్మ విగ్రహం, ఘాట్ కిందిభాగం మెట్ల వద్ద శివలింగం ఉంది. ఇక్కడ అనేక ఏళ్లుగా ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇటీవల పారిశుద్ధ్య నిర్వహణ గాలి కొదిలేయడంతో శివలింగం కళ తప్పుతోంది. ఎంట్రన్స్‌లోనే పుష్కర ఘాట్లు చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయి.

కలుషిత నీటిలోనే స్నానాలు

మహారాష్ట్రలోని నాసిక్ త్రయంబకేశ్వర్‌లో పుట్టిన గోదారమ్మ బాసర వద్ద చదువులమపాదాలను తాకి తెలుగురాష్ట్రాల్లోకి అడుగిడుతుంది. ఎగువన భారీ వర్షాలు కురిసినపుడు వచ్చే వరదలతో ఘాట్లు పరిశుభ్రమవుతున్నాయే తప్ప అధికారులు తీసుకుంటున్న చర్యలు శూన్యమనే చెప్పాలి. గత పుష్కరాల సమయంలో రూ.10 కోట్లు వెచ్చించి నిర్మించిన ఘాట్లు అధ్వానంగా మారిపోయాయి. ఫలితంగా పుణ్యస్నానాల కోసం వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. అంతేకాకుండా గోదావరినదిలో నీళ్లు కూడా కలుషితం అయ్యాయి. ఆలయ అధి కారులు భక్తుల సౌకర్యార్థం షవర్స్ ఏర్పాటు చేసినా కొంత మంది భక్తులు కలుషిత నీటిలోనే స్నా నాలు చేస్తున్నారు. ఇప్పటికైనా దేవాదాయశాఖ అధికారులు స్పందించి పుష్కరఘాట్లను పరిశుభ్రంగా ఉంచాలని భక్తులు కోరుతున్నారు.

విదేశీ పర్యటనకు ఏవో

- మంత్రులు, ఐఏఎస్‌లతో కలిసి వెళ్లనున్న విశ్వనాథ్
- బెల్లంపల్లికి చెందిన హార్టికల్చర్ అధికారి కూడా..


విశ్వనాథ్, ఏవో

ఆదిలాబాద్‌టౌన్: వ్యవసాయ శాఖ ద్వారా విదేశాల్లో అధ్యయనం కోసం ఆ శాఖ మంత్రి, ఐఏఎస్ అధికారులతో కూడిన బృందాన్ని పంపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బృందంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి ఎం.రఘునందన్‌రావు, రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ కె.సురేంద్ర మోహన్, హార్టికల్చర్ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తదితరులు ఉన్నారు. వీరితో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు దక్కింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో టెక్నికల్ ఏవోగా పనిచేస్తున్న విశ్వనాథ్, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన ఉద్యానవన అధికారి జె. అర్చన ఎంపికయ్యారు. వీరు నెదర్లాండ్, ఫ్రాన్స్‌లోని ప్యారీస్‌లలో పర్యటించనున్నారు. జూన్ 10 నుంచి 15 వరకు కొనసాగే పర్యటనలో ఆ దేశాల్లో వ్యవసాయం, ఉద్యానవన పంటల సాగు స్థితిగతులు, దిగుబడులు సాధించేందుకు అనుసరిస్తున్న విధానాలు, నూతన వంగడాల సృష్టికి అవలంభిస్తున్న పద్ధతులు వంటి పలు అంశాలపై అధ్యయనం చేయనున్నారు. మూడు రోజుల చొప్పున ఆయా దేశాల్లో పర్యటిస్తారు. రాష్ట్ర బృందంలో ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులు ఉండటంతో ఇక్కడి రైతులకు సాగుపరంగా ప్రయోజనం కలిగే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అదుపులోకి మరికొందరు నిందితులు!

- ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో కొనసాగుతున్న విచారణ

దహెగాం/పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూర్ అటవీ ప్రాంతంలో గత వారం వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి పెద్ద పులి మృతి చెందడంతో అటవీశాఖ అధికారులు మంగళవారం రాత్రి, బుధవారం పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూర్, అగర్‌గూడ, దహెగాం మండలంలోని గెర్రె, అమరగొండ గ్రామాలకు చెందిన పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఎల్లూర్ అటవీ ప్రాంతంలో మృతి చెందిన పెద్దపులి అవశేషాలు దహెగాం మండలంలోని చినరాస్పెల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంటి పెరట్లో పాతిపెట్టిన వాటిని బయటకు తీసిన విషయం తెలిసిందే. గ్రామ సమీపంలోని ప్లాంటేషన్ వద్ద పాతి పెట్టిన పులిచర్మం స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఉదయం కాగజ్‌నగర్ వైల్డ్ లైఫ్ సీసీఎఫ్ ఎల్‌వి సింగ్, సీసీఎఫ్ శాంతారాం, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టోబ్రియల్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం పులి అవశేషాలు లభించిన ఎల్కరి శేఖర్ ఇంటికి వెళ్లి అతని భార్యను సైతం విచారించారు. పులిని ఖననం చేసిన ప్రదేశానికి వెళ్లి మరోసారి పరిశీలించారు. దహెగాం మండలంలోని చినరాస్పెల్లి గ్రామానికి చెందిన ఒకరు, అమరగొండ, కర్జి గ్రామాలకు చెందిన మరో ఎనిమిది మందిని, పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూర్, అగర్‌గూడ గ్రామాలకు చెందిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అదుపులో ఉన్న వారి కాల్‌డేటాను పరిశీలిస్తున్నారు. పులి అవశేషాలు అమ్మకానికి బేరం పెట్టారా? అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిసింది. కాగా ఎలాంటి సమాచారం లేకుండా విచారణ పేరుతో అమాయకులను అటవీశాఖ అధికారులు వేధిస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు వాపోతున్నారు. పులిని హతమార్చిన వారిని శిక్షించి అమాయకులను వదిలిపెట్టాలని వేడుకుంటున్నారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన వైల్డ్ లైఫ్ పీసీసీఎఫ్..

పెంచికల్‌పేట్ రేంజ్ పరిధిలోని ఎల్లూర్ అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలతో పెద్ద పులిని హతమార్చిన ప్రాంతాన్ని వైల్డ్ లైఫ్ పీసీసీఎఫ్ ఎలుసింగ్ మెరు బుధవారం పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎఫ్‌డీపీటీ శాంతారాం, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ ఉన్నారు.

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని పొచ్చరకు చెందిన కొలిపెల్లి వినయ్ (19) మావల మండలంలోని ఓ పెట్రోల్ పంపులో పని చేసేవారు. నెల రోజుల నుంచి పనికి వెళ్లకుండా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. బుధవారం పొచ్చర శివారు ప్రాంతంలోని జాతీయ రహదారి సమీపంలో ఉరేసుకున్నాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు..

మండలంలోని చాందా (టి) గ్రామానికి చెందిన చింతల నారాయణ (59) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నారాయణ పలుచోట్ల చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఇంటి వద్ద పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులకు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు


నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

జైనథ్ : మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ గోదాం వద్ద బుధవారం గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై గౌతమ్ తెలిపారు. అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఖుర్షీద్‌నగర్‌కాలనీకి చెందిన సాహిల్ , ముషీర్ గంజాయి విక్రయిస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి నిందితులను అరెస్ట్ చేసి 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పేకాడుతున్న 13 మంది..

నేరడిగొండ: పేకాడుతున్న 13 మందిని బుధవారం అరెస్టు చేసినట్లు ఇచ్చోడ సీఐ బండారి రాజు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు నేరడిగొండ ఎస్సై శ్రీకాంత్ సిబ్బందితో కలిసి వెళ్లి మండల కేంద్రంలోని నీలిమ దాబా వెనకాల దాడులు నిర్వహించి పేకాడుతున్న 13 మందిని పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వారి వద్ద నుంచి పేక ముక్కలతో పాటు రూ.14,080 నగదు, ఆరు ద్విచక్ర వాహనాలు, 13 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సయ్యద్ జహీర్, గడ్డం రవి చందర్‌రెడ్డి, గూడూరు లవకుమార్, రాథోడ్ రవీందర్, అల్లూరి శివారెడ్డి, ఉప్పు పోశెట్టి, సోలంకి శ్రీనివాస్, నల్ల అడెల్లు, సోలంకి కరన్ సింగ్, గోతి గులాబ్ సింగ్, మాడ గంగాధర్, అల్లూరి శ్రీనివాస్ రెడ్డి, పవార్ సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

టపాసులతో ఇబ్బందులకు గురిచేసిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: అర్ధరాత్రి టపాసులు పేల్చి జనాలను ఇబ్బందికి గురిచేసిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. పట్టణంలోని వడ్డెర కాలనీకి చెందిన చోట ముష్రఫ్ తన జన్మదినం సందర్భంగా ఇంటి ముందు, బిల్డింగ్‌పై బాణసంచాలు పేల్చాడు. దీంతో చుట్టుపక్కల వారు ఇబ్బందులకు గురయ్యారు. ఓ ఇంటిపై వేసిన ప్లాస్టిక్ కవర్‌కు నిప్పంటుకోవడంతో కొంతభాగం కాలిపోయింది. దీంతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఐదుగురిపై..

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టి) శివారు ప్రాంతం మీదుగా ఎలాంటి డాక్యుమెంట్‌లు లేకుండా వాహనంలో రెండు ఎడ్లను తరలిస్తున్న రాథోడ్ నితిన్, షేక్ సాకీర్‌పై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపారు. అలాగే వాహనాన్ని అడ్డుకుని బెదిరింపులకు గురి చేసిన చాందా (టి) గ్రామానికి చెందిన ముగ్గురు యువకులపై రాథోడ్ నితిన్, షేక్ సాకీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దాడి చేసిన వ్యక్తులపై..

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని పండ్ల వాపారిపై దాడికి పాల్పడిన షన్ను, మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలో తోపుడు బండ్లపై షేక్ షహెబాజ్ పండ్లు విక్రయిస్తున్నాడు. ఎద్దు వచ్చి పండ్లను తింటుండగా అతను ఎద్దును కొట్టడంతో షన్నుకు తగిలింది. దీంతో ఆయన ద్విచక్ర వాహనం దెబ్బతింది. ఇందుకు రూ.2వేలు ఇవ్వాలని అడిగాడు. తనవద్ద లేవని చెప్పడంతో తన మిత్రులను పిలిచి షహెబాజ్‌పై దాడికి పాల్పడ్డాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వివరించారు.

ఇద్దరు యువకుల బైండోవర్


బైండోవర్ చేస్తున్న పోలీసులు

నిర్మల్‌రూరల్: గంజాయి విక్రయిస్తున్నారన్న అనుమానంతో జిల్లా కేంద్రంలో ఇద్దరు యువకులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. గుండంపెల్లి గ్రామానికి చెందిన సత్యపోలు యోగేష్, భైంసా పట్టణం పురాణ బజార్‌కు చెందిన షేక్ కైఫ్ జిల్లా కేంద్రంలోని విశ్వనాథ్‌పేట్‌లో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో రూరల్ పోలీసులు అక్కడికి వెళ్లి తనిఖీ చేయగా వారి వద్ద ఎలాంటి గంజాయి లభించలేదు. కానీ భవిష్యత్‌లో గంజాయి సేవించడం లేదా విక్రయిస్తారన్న అనుమానంతో వారిద్దరిని రూరల్ తహసీల్దార్ సంతోష్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఒక్కొక్కరికి లక్ష రూపాయల జరిమానా లేదా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టోల్ ట్యాక్స్ నిలిపివేయాలని ధర్నా


ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

చెన్నూర్‌రూరల్: కిష్టంపేట సమీపంలోని వైజంక్షన్ వద్ద టోల్ ట్యాక్స్ నిలిపి వేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో టోల్‌గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా ట్యాక్స్ పేరుతో దోపిడీకి గురిచేస్తున్నారన్నారు. అటవీశాఖలో ఎక్కడా ఈ టాక్స్‌లు వసూలు చేయడం లేదన్నారు. కాళేశ్వరంలో పుష్కరాలు నిర్వహిస్తున్న సమయంలోనే ఈ ట్యాక్స్ వసూలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళన విరమింప జేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బత్తుల సమ్మయ్య, రాపర్తి వెంకటేశ్వర్‌గౌడ్, బుర్ర రాజశేఖర్‌గౌడ్, తుమ్మ శ్రీపాల్, తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ పనులపై సమీక్ష


సమీక్ష నిర్వహిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణ

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో సింగరేణి నూతనంగా ఏర్పాటు చేస్తున్న 67.5 మెగా వాట్స్ సోలార్ పవర్ ప్లాంట్ పనులపై ఏరియా జీఎం ఆఫీస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) సత్యనారాయణ బుధవారం ఏరియా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏరియా జీఎం దేవేందర్‌తో పాటు అధికారులను అడిగి పనుల అభివృద్ధిని తెలుసుకున్నారు. పవర్ ప్లాంట్ ఏర్పాటు పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జీఎం (ఈఅండ్‌ఎం) సోలార్ ఎనర్జీ జీఎస్ జానకీరామ్, ఎస్వో టూ జీఎం విజయ్‌ప్రసాద్, ఏరియా ఇంజనీర్ (ఈఅండ్‌ఎం) వెంకటరమణ, పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, కేకే గ్రూపు ఏజెంట్ రాంబాబు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, ఐఈడీ రాజన్న పాల్గొన్నారు.

ఇసుక ఫిల్టర్ చేసే బోట్ సీజ్


సీజ్ చేసిన ఇసుక ఫిల్టర్ బోట్‌తో పోలీసులు

జైనథ్: పెన్‌గంగ నుంచి అక్రమంగా ఇసుక ర వాణా చేస్తున్న వ్యాపారి అభిలాష్‌రెడ్డితో పాటు సాంగ్వి గ్రామ వీడీసీ సభ్యులపై బుధవారం కేసు నమోదు చేసినట్లు జైనథ్ సీఐ సాయినాథ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు పెన్‌గంగ నది శివారులోని సాంగ్వి గ్రామం వ ద్ద ఎస్సై గౌతమ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉల్లాస్, సిబ్బందితో కలిసి దాడి చేసి ఇసుకను ఫిల్టర్ చేసే బోట్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. ఇసుక దొంగతనం, పీడీపీపీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

దాడి చేసిన వ్యక్తికి జరిమానా

మంచిర్యాలక్రైం: కోర్టు ఆవరణలో ఒకరిపై దాడికి పాల్పడిన వ్యక్తికి రూ.వెయ్యి జరిమానా విధిస్తూ స్థానిక సివిల్ కోర్టు జడ్జి కే.నిరోషా బుధవారం తీర్పునిచ్చినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. గౌతమినగర్‌కు చెందిన బిల్ల మల్లయ్య హైటెక్ సిటీకి చెందిన ఆజ్మీర రాజేశ్‌పై చెక్‌బౌన్స్ కేసు వేశా డు. 2017 సెప్టెంబర్ 14న కోర్టులో హాజరయ్యేందుకు రాగా రాజేశ్ కోర్టు ఆవరణలో మల్లయ్యపై దాడికి పాల్పడ్డాడు. కేసు వాపస్ తీసుకొమ్మని బెదిరించాడు. మల్లయ్య అప్ప టి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జికి ఫి ర్యాదు చేశాడు. ఫిర్యాదును స్థానిక పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేయగా కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేయాలని న్యాయమూర్తి ఆదేశాలతో రాజేశ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

‘ప్రభుత్వ ఉద్యోగులపై ఆరోపణలు సరికాదు’


ఫిర్యాదు చేస్తున్న నాన్ గెజిటెడ్ ఉద్యోగులు

జైపూర్: జైపూర్ మండలంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న తిరుపతిపై మాదిగ హక్కుల దండోరా నాయకులు చేసిన అసత్యపు, నిరాధారమైన ఆరోపణలు ఖండిస్తున్నామని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నాయకులు తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం మందమర్రి యూనిట్ అధ్యక్షుడు సుమన్, కార్యదర్శి సతీశ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులపై కక్షపూరితంగా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ తిరుపతి, సభ్యులు రవిచందర్, శ్రీనివాస్, ప్రశాంత్, సత్యనారాయణ, సురేశ్, ఉదేయ్‌కుమార్, స్వామి, అపర్ణదేవి, రజిత, విజయ్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు కొంటున్నారా?

- జాగ్రత్తలు తప్పనిసరి


జొన్న విత్తనాలు

చెన్నూర్‌రూరల్: మరికొద్ది రోజుల్లో వానాకాలం సాగు ప్రారంభమవుతోంది. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల కొనుగోలులో రైతులు బిజీ అవుతున్నారు. ఇలాంటి సమయంలో రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలి. అనుమతులు లేని కంపెనీలకు చెందిన విత్తనాలు, కల్తీ విత్తనాలు మార్కెట్‌లోకి వచ్చే అవకాశముంది. రైతులు ఒకటికి రెండుసార్లు ఆలోచించి అన్ని వివరాలు పరిశీలించాకే కొనుగోలు చేయాలి. అనుమానం వస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం అందించాలని చెన్నూర్ ఏవో యామిని సూచించారు. లైసెన్స్ లేని దుకాణాలు, దళారుల వద్ద ఎక్కడ పడితే అక్కడ కొనుగోలు చేయకూడదు. సరుకు, లాట్ నంబర్, తయారీ, తేదీ, రకం ఇలా అన్ని వివరాలు ఉండి సంతకం చేసిన బిల్లును విక్రయదారు (షాపు) నుంచి తప్పనిసరిగా తీసుకోవాలి. సంచులపై సీల్ తీసినట్లు లేదా విప్పదీసి తిరిగి కుట్లు వేసినట్లు కనిపిస్తే తీసుకోకూడదు. వ్యవసాయశాఖ నుంచి అనుమతి పొందిన డీలర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, సహకార సంఘాల నుంచి మాత్రమే ఎరువులు కొనుగోలు చేయాలి. క్రిమిసంహారక మందుల డబ్బాలపై కంపెనీ పేరు, తేదీ, కాలపరిమితి, గమనించి రసీదులు తీసుకోవాలి. ఏది ఎంత ధరతో కొన్నా.. డీలర్ లేదా దుకాణాదారు సంతకంతో తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలి. మీరు తీసుకున్న విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు నకిలీవని అనుమానం వస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలి. అలాగే లాట్ నంబర్, తయారీ తేదీలను తప్పనిసరిగా చూసుకోవాలి. లేదంటే గతేడాది విత్తనాలు, మందులు, ఎరువులు అంటకడతారు. రైతులు ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండి కాలం చెల్లిన మందులు, ఎరువులు, విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో కొనకూడదు. అలాగే మందు డబ్బాలపై ఆకుపచ్చని లేబుల్ ఉందో లేదో గమనించాలి. ఆకుపచ్చ లేబుల్ ఉంటేనే ఆ మందును కొనుగోలు చేయాలి. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల కొనుగోలు విషయంలో రైతులు ఈ జాగ్రత్తలు తప్పకుండా పాటించి నాణ్యమైన దిగుబడులు పొందాలి.

నింగీ నేల ఏకమైనట్లు ఆవిష్కృతమైన అద్భుత చిత్రం



ఆకాశం మేఘావృతం కావడంతో ఇలా నేలను తాకుతుందేమో అనేట్లుగా కలిసిపోయిన చిత్రం బుధవారం సాయంత్రం సిరికొండ శివారులోని పంటచేనులో ఆవిష్కృతమైంది. పంటచేలలో వేసవి దుక్కులతో బిజీగా ఉన్న అన్నదాతలకు ఈ చిత్రం కనువిందు చేసింది. వాతావరణంలో ఒక్కసారిగా మార్పు మొదలై వర్షం కురిసింది.

– సిరికొండ